# అనగనగనగా ఒక కథ!

ఇస్మాయిల్ ఖాన్



అప్పుడెప్పుడో ఒకనాడు అందమైన ఇల్లది!

ఈనాడు చాలా పాతది... శిథిలావస్థకి చేరుకుంది.

ఎక్కడో ఆహారాన్ని ఏరి, తీరిగ్గా తిందామనే ఉద్దేశంతో ఇళ్ళపై కప్పులమీద వాలి, కాళ్ళక్రింద పెట్టుకున్నది కాస్త పెంకుల మధ్య ఇరుక్కుంటే, దాన్ని మళ్ళీ తీసి తినాలనే ఆదుర్దాతో తమ ముక్కులతో పెంకుల్ని లాగే పక్షులవల్ల చిందరవందరైన కప్పు.

వెల్లవేసి చాన్నాళ్ళయ్యిందనటానికి నిదర్శనంగా నల్లబడి అసహ్యంగా కనపడే గోడలు.

పగటివేళ ఇంటిలోకి సూటిగా దూసుకు వచ్చే సూర్యుని కిరణాలు వెలుగునిస్తే—

రాత్రులు చంద్రుడు కొండమీదనుంచి పడే జలపాతంలా కురిపిస్తాడు వెన్నెల!

విసనకర్రల అవసరం అసలే అక్కరలేదు! ఆ ఇంటి కప్పును ఎన్నో ఏళ్ళు మోసిన గోడలు ఇక మోయలేననుకున్నాయేమో ఒక వైపు గోడ కొంచెం ప్రక్కకు ఒరిగింది. మరోవైపు గోడ సగం పడిపోయింది. కప్పు కూలకుండా ఆధారంగా గుంజలు పెట్టారు. ఇంకోవైపు గోడకూడా ఏ క్షణంలోనైనా పడిపోయేట్టుంది.

అది వారికి చావుబ్రతుకుల సమస్యగా మారింది. ఎప్పుడు కూలుతుందోననే భయం పట్టుకుంది. ఆ ఇంట్లో చదువుకుంటున్న ఇద్దరు పిల్లలకు తప్ప మిగతా వారికి బ్రతుకు మీద ఏవగింపు కలుగుతోంది. అయినా మృత్యువు పీడన కాలం వెళ్ళబుచ్చాలంటే భయమేకదా! ఇల్లు కూలి మీదపడితే చావకుండా కాలో చెయ్యో విరిగితే మరో రకం నరకం అని కావచ్చు.

మొత్తానికి ఆ ఇల్లు భారత పుత్రుడి దిగజారిన సగటు జీవితానికి ప్రత్యక్ష నిదర్శనంగా ఉంది.

అదొక వింతైన వాతావరణం!

ఇక వర్షం కురిస్తే మాత్రం ఆ ఇంట్లో చిన్న చెఱువు ఒకటి ఏర్పడుతుంది. దాంతో నిలవటానికి, కూర్చోటానికి చోటుండదు.

పక్షవాతంతో కాలూ, చెయ్యి పడిపోయిన గోపయ్య ఎప్పుడూ మంచం మీదే. వర్షం వచ్చిన రోజు అతనిమీద వర్షపు నీరు పడకుండా ఇద్దరు ముగ్గురు తలో చెంబు, తపేలా పట్టుకొని నిలబడాల్సిందే!

"వేరే ఇంటికి మారుదాం నాన్న?" అన్నాడు కొడుకు శివ ఒకనాడు తండ్రితో.

గోపయ్య అందుకు అంగీకరించలేదు. బయట కట్టే అద్దెదో దాచి కూతురు పెళ్ళి చేయాలని అతని ఆశ. కొడుకుతో అదే చెప్పాడు. అయితే అతనికి వచ్చే కొద్ది జీతం ఇంటి అవసరాలకే సరిపోతోంది. ఇల్లు మారాలనే శివ కోరిక కోరికగానే మిగిలింది. డబ్బు దాచి కూతురు పెళ్ళి చేయాలనే గోపయ్య ఆశ ఆశగానే మిగిలిపోయింది.

గోపయ్య ఇల్లు మారనివ్వలేదు...పరిస్థితుల ప్రభావంతో శివ డబ్బూ దాచలేకపోయాడు.

ఆ రోజు ఆదివారం.

అందరికీ సెలవురోజు. మరునాడు మూలే అనుకోండి. అది వేరే విషయం! కాని, ఆ రోజు ఒక కన్నెపిల్ల వయసుకూ కూడా సెలవుదినం కాబోతోందని ఎవరికి తెలుసు?

గోపయ్య స్నేహితుడు, ఆ ఇంటికి చిరపరిచితుడైన జనార్దన్ వెంటబెట్టుకు వచ్చిన ఇద్దరు కొత్త వ్యక్తులకు తప్ప—!?

ఆ సమయంలో అందరూ ఇంట్లోనే ఉన్నారు.

క్రొత్తవారి రాకతో ఇంటి వారందరూ కంగారు పడిపోయారు. బహుశా తమని, తమ

ఇంటిని చూస్తే తాము పడే కష్టాలు, తమ దీనస్థితి, హీనస్థితి వాళ్ళకు తెలిసిపోతుందని కావచ్చు.

శివ అప్పుడే బజారుకెళ్ళటానికి తయారవుతున్నాడు. అతిథుల రాకతో ఆగిపోయాడు. అప్పుడు సాయంత్రం నాలుగైంది.

జనార్దన్ వెంట వచ్చిన వాళ్ళ వయస్సు యాభై కిలోపే ఉంటుంది. మధ్య గదిలో గోపయ్య మంచం ప్రక్కనే మూడు కుర్చీలు వేయించాడు జనార్దన్. ఇప్పుడిప్పుడే త్రుప్పు పడుతున్నాయా కుర్చీలు.

వాళ్ళను గోపయ్యకు పరిచయం చేశాడు జనార్దన్.

"వీడు నా స్నేహితుడు రాజారావు. ఈయన రాజారావుకు బాగా తెలిసిన వారు కోటిగారని. ఇద్దరూ కలిసి విజయవాడలో స్టీలుకొట్టు వ్యాపారం చేస్తున్నారు. ఇద్దరిదీ ప్రక్కనున్న చందర్లపాడు గ్రామమే."

"అలాగా."

అసలు సంగతి ప్రారంభించాడు జనార్దన్.

"ఈ కోటిగారికొక కొడుకున్నాడు. పెళ్ళి చేద్దామనుకుంటున్నారు. పేదింటి పిల్లను కోడలుగా తెచ్చుకోవాలని ఉబలాట పడుతున్నారు. అబ్బాయి సొంత ఊరిలోనే వ్యవసాయం చేస్తున్నాడు. కొంత మాగాణి భూమి ఉంది. నీకు ఇష్టమైతే ఒప్పేసుకో. నీ గురించి అన్నీ ముందే వీరికి వివరించాను. ఇక ఆలశ్యం నీదే!"

అది విన్న ఆ ఇంటి వారి హృదయాలలో పన్నీటి జల్లు కురిసింది. అసలు తాము వింటున్నది కలా? నిజమా? అనే డోలాయమాన స్థితిలో పడ్డారు. వారి హృదయాలు తియ్యగా స్పందించసాగాయి. ఆనందంతో కూడిన చిన్న వణుకు పెద్దవాళ్ళల్లో బయలుదేరింది!

బజారు వెళ్ళటానికి తయారవుతున్న శివ జనార్దన్ చెప్పినది వినగానే వెంటనే ఆగిపోయి, మూలపడిన ఫ్లాస్కు తీసి తనేకడిగి టీ కోసం హోటల్‌కి పంపించాడు తమ్ముడికిచ్చి.

శివ తల్లి అనసూయమ్మలో హడావుడి మొదలైంది. తమ స్తోమత ఏదో వాళ్ళకు తెలిసినా వరండాలో నున్న కుక్కి మంచాన్ని మరో గదిలో ఉంచింది. అందాక లేని తొందర ఎక్కడ్నించి వచ్చి పడిందో ఆమెలో!

అంతకు ముందే వసారాలో కూర్చుని చిన్న కొడుకు అన్నంతిని ఖాళీచేసి వదిలి వెళ్ళిన పళ్ళెం గ్లాసు గబగబా తీసేసింది అక్కడ్నుంచి!

ఓ మూల చినిగి, మాసిపోయిన బట్టలుంటే వాటిమీద బాగున్న దుప్పటి నొకదాన్ని కప్పింది.

ఆమెలో ఆదుర్దా అధికమైంది. ఇంకేం చేయాలో పాలుపోలేదు. ఒక క్షణం అక్కడే నిలబడి ఇంటిపై దృష్టి సారించింది. బూజు దులిపి చాన్నాళ్ళయిందనిపించిందామెకు.

సాలెపురుగులు దట్టంగా అల్లుకున్నాయి. "సాలె పు రు గు లై నా కాకపోతిమి అడవి లోనైనా చక్కటి గూళ్ళను నిర్మించుకోవచ్చు" అనే చిలిపి ఊహ కలిగింది శివకి. ఆ వూహ రాగానే నవ్వుకున్నాడు.

గోపయ్య భార్యను కేకేసి కూతుర్ని తీసుకు రమ్మన్నాడు. ఆమె ఏదో గుర్తొచ్చినదానివలె రోడ్డువైపు నడిచింది హడావుడిగా.

గోపయ్యకి జనార్దన్ చెప్పిన విషయాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కృతజ్ఞత ఎలా చెప్పాలో అర్థం అయి చావటంలేదు. మాటలు రావటమే కష్టమైపోయింది.

అతడి కళ్ళల్లోని కృతజ్ఞతను గమనించాడు జనార్దన్. అతని కళ్ళల్లో సన్నని నీటిపొర ఏర్పడింది. గోపయ్య నీరు నిండిన తన కంటి రెప్పల్ని ఆడిస్తుంటే అతనికి, కోటి కురుక్షేత్ర మహా సంగ్రామంలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించిన కృష్ణునివలె కనిపిస్తున్నాడు... ఎన్నో ఉన్నత భావాలు కలిగిన పొట్టిమనిషిలామా కనిపిస్తున్నాడు.

జనార్దన్ చిన్నగా నవ్వుకున్నాడు.

బట్టలుతుకుతోన్న కూతుర్ని లేపి, చేతికి సబ్బుపెట్టి ఇచ్చింది అనసూయమ్మ. అరుణకు అర్థం కావటంలేదు పరిస్థితి.

"త్వరగా ముఖం కడుక్కో. నిన్ను చూట్టానికి వచ్చారు."

అరుణ గుండెలు వేగంగా కొట్టుకోసాగినై. సబ్బుతో చేతులు, ముఖం కడుక్కొని ప్రక్కనున్న గుమ్మంలో నుంచి ఇంట్లోకెళ్ళింది. అప్పటికే తల్లి సంవత్సరం క్రితం శివ తెచ్చిన నీలం రంగు చీర, జాకెట్టు తీసి సిద్ధంగా ఉంచింది. ఉన్న రెండు చీరల్లోనూ అదే కాస్త బాగుందనిపించిందామెకు— మాసిపోయిపాతబడ్డా! నాలుగేళ్ళక్రితం కొన్న చీరకుమల్లే ఉంది!!

పౌడరు పల్చగా ముఖానికి అద్దుకోమంది తల్లి. జడ ఉదయమే వేసుకుని ఉండటంతో ఆ బాధ తప్పిందిప్పుడు.

"రా, త్వరగా !" అంటూనే కూతుర్ని లాక్కెళ్ళినంత వేగంగా తీసుకొచ్చి చూడొచ్చిన వాళ్ళముందు నిలబెట్టింది.

ఇరవై మూడేళ్ళ వయస్సును దాచలేకపోతుంది ఆమె ముఖం. ఎర్రటి ఆమె దేహఛాయకి నీలం రంగు చీర మరింత అందాన్నిచ్చింది. నిండుగా కనబడిందామె వాళ్ళకు. తమకు నచ్చినట్లు తలాడించారు వాళ్ళు.

జనార్దన్ అరుణను లోనికి తీసుకెళ్ళమని సైగ చేశాడు. అరుణ లోనికెళ్ళిపోయింది. ఒకే ఒక నిముషం నిలబడింది అరుణ వాళ్ళముందు. ఆ నిముషం తర్వాత సుడిగుండంలో చిక్కుకున్న చేప ఒక్కసారిగా ప్రవాహంలో పడి ఊపిరి పీల్చుకున్నట్లయింది!

అనసూయమ్మలో ఎన్నోరకాల వేడుకలు, ఎన్నో ప్రార్థనలు... ఈ సంబంధమే నిర్ణయమవ్వాలని, ఈ సంబంధం తప్పిపోకూడదని.

అరుణ మనసు రెక్కలు విప్పుకుంది. ఇప్పటివరకు ఇదొక జైలు. ఆ జైల్లోంచి స్వేచ్ఛ లభించబోతోంది!

నీలాకాశంలో ఆనందంగా ఎగురుతోంది. ఎవ్వరితో పంచుకోవాలో ఈ ఆనందాన్ని? అర్థం కాక ఉక్కిరి బిక్కిరి అవుతోంది ఆమె మనసు. ఆమెకు వెయ్యేళ్ళ అనుభూతి కలుగుతూంది.

తండ్రి బాగుండి ఉంటే ఈపాటికి నలుగురు పిల్లల తల్లి అయ్యేది తను. ఆ యోగం లేదు కనుకే ఇలా రాయిలా పడి ఉంది! తీపి కలలు కంటూ, చేదు జీవితం అనుభవిస్తుంది. తన కలల్ని ఊహల పల్లకీల్లో మోస్తూ, వేడి నిట్టూర్పులు విడుస్తూ కాలం తీర్చుకోసం వేచి చూస్తూండిపోయింది. ఎంతకీ పండని కలల్ని



న్యూఇండియా అస్యూరెన్స్ కంపెనీ డివిజనల్ మానేజరు శ్రీ వాదూరి వెంకటరామన్ దంపతులని వారి వివాహ రజతోత్సవ వేడుకల సందర్భంగా సత్కరించిన విజయవాడ బ్రాంచి మానేజరు శ్రీ జి. రామమూర్తి దంపతులని చిత్రంలో చూడవచ్చు.

చూసి ఎందుకీ బ్రతుకు ? అనిపించేది. ఎండి పోతుందేమో అనుకున్న మ్రాను మళ్ళీ చిగురు వేయసాగింది.

"అబ్బాయినికూడా తీసుకు రావలసింది?" అన్నాడు గోపయ్య.

"అక్కర్లేదు ! నా మాటే వాడి మాట. అమ్మాయి మాకు నచ్చింది. మరి...?"అంటూ ఆగాడు కోటి.

"అడగండి ?" అన్నాడు శివ – తండ్రి మంచంమీద కూర్చుంటూ.

"అయిదు వేలు !" అన్నాడు కోటి.

కొద్దిసేపు మవునం రాజ్యమేలింది.

అనసూయమ్మ గుండె ఆగినంత పని అయ్యింది అంత కట్నం అడిగేటప్పటికి.

అరుణ గుండెలో రాయి పడింది. నీరుకారి పోయింది. ఆశ అడియాశ అయ్యింది.

తియ్యటి ఊహాలోకాల్లో విహరిస్తున్న స్వేచ్ఛాపక్షిని ఎవరో తమ మంత్రోచ్చారణతో నేలకూల్చినట్టయ్యింది.

ఒక్కసారి అరుణలో దిగులూ బయలు దేరింది. ఆ కళ్ళల్లో కాంతి పోయి కన్నీరు వుబికింది.

అయిదు వేలు కట్నం ఇవ్వలేమని ఆమెకు తెలుసు. అందుకే ఆ దిగులు... ఆ నిరాశ... ఆ కన్నీరు.

అనసూయమ్మలో శక్తి హరించుకు పోయినట్లు నిలబడ్డ చోటే కూలబడింది. కాళ్ళు, చేతులు చల్లబడ్డాయి.

అరుణ కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయింది.

కోటి ఉద్దేశమయితే పేదింటి పిల్లని కోడలుగా తెచ్చుకోవాలని. కాని కట్నం ఆశ మాత్రం ఆకాశం ఎత్తుండేసరికి గోపయ్యకి కోటిలోఉన్న ఉన్నత ఆదర్శం ఏమిటో అర్ధం కాలేదు ! తమ స్తోమతను జనార్ధన్ వాళ్ళకి వివరిస్తే వాళ్ళు అర్ధం చేసుకున్నది ఇదేనా ?

శివ ఎంతన్నా వెనుకాడే స్థితిలో లేడు. ఈ సంబంధమే ఖాయం చేసుకోవాలనుకున్నాడు.

అంత కట్నం ఇవ్వటానికి గోపయ్య సిద్ధంగా లేడు.

ముందు జనార్ధన్ నోరు తెరిచాడు. "మీరు వారి పరిస్థితి గ్రహించి అడగాలి."

చివరికి ఎలాగైతేనేం నాలుగు వేలకి సంబంధం కుదిరింది.

పెళ్ళికి ఉన్నది ఒక కూతురే. ఉన్న అర ఎకరం పొలం అమ్మి కూతురు పెళ్ళి చేస్తార్లే అనుకొని అడిగాడేమో కోటి ? అనుకున్నాడు జనార్ధన్.

అయితే జనార్ధన్, కోటి అంత కట్నం అడగడులే అనుకున్నాడు. తీరా నాలుగు వేలకు ఒప్పందం కుదిరేక అతనికి బాధగానే ఉంది. పేదింటి పిల్లను కోడలుగా తెచ్చుకోవాలనుకునే కోటి బంగారంలాంటి పిల్లని కళ్ళు మూసుకుని కోడలుగా తెచ్చుకోక ఆమెను పెంచటానికని కాబోలు అంత కట్నం అడిగేటప్పటికి, అప్పటి వరకూ కోటిమీదున్న గౌరవభావం కాస్త నశించి పోయింది అతనిలో.

ఒక ఆడపిల్ల కాబోయే తన భర్తకికాక కాబోయే మామగారి ఆశకి లోకువ కాబోలు ఈ సమాజంలో !

తాము చెప్పే మాటలకు, చేతలకు పొంతన ఉంటేనే ఎదుటివాడు గౌరవమిచ్చేది అనే విషయం కోటికి తెలుసు !

అయినా పేదింటి పిల్లను కోడలుగా తెచ్చుకోవాలని చెప్పి అంత ఆశకు ఎగబడ్డాడు ఎందుకనంటే ?

అది అతనికే తెలుసు ! రాజారావుకే తెలుసు !! తెలియనిదల్లా ఇతరులకే ?

అంతలో టీలు వచ్చాయి. టీ త్రాగి వెళ్ళి పోయారు – ఫలాన రోజు డబ్బు తీసుకురావాలనే విషయం మాట్లాడి.

అరుణ హృదయం ఆనందంతో పొంగి పోయింది. నేల కొరిగిన పక్షికి ఎవరో దైవాంశ సంభూతుడు ప్రాణం పోసినట్టయ్యింది. ఆమె మనసు మళ్ళీ రెక్కలు విప్పింది. సంతోషంగా పగటి కలల లోకంలో విహరించసాగింది. ఆమె ముఖంమీది విచార రేఖలు మటుమాయమైనాయి.

తల్లి కళ్ళల్లో ఏదో కృతజ్ఞత! ఎవరిమీదో? బహుశా కొడుకుమీద కావచ్చు. లేదా ఐదువేల నుంచి నాలుగువేలకు తగ్గించిన కోటిమీదో లేక జనార్ధన్‌మీదో కావచ్చు. అయితే —

ఇచ్చేవాడు తన వాడైనప్పుడు, అతడే విధంగా కష్టపడి సంపాదించినా పుచ్చుకునేవాడు సక్రమంగా స్వీకరించినట్లయితే ఆమె కళ్ళల్లోని కృతజ్ఞతా భావం కోటిమీదేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

కొడుకు శివ అంత కట్నానికి ఎందుకు ఒప్పేసుకున్నాడో అర్థం చేసుకోలేకపోతున్నాడు గోపయ్య.

ఆ విషయమే అడిగాడు.

"అంత డబ్బు ఎక్కడ్నుంచి తెస్తావురా ? వడ్డీకి తెస్తావా ?"

తండ్రి ప్రశ్నలోని వేదన గమనించాడు శివ. తల్లికూడా అదే ప్రశ్న వేయబోయింది. భర్త అడగటంతో ఆగిపోయింది.

"లేదు నాన్న. వడ్డీకి తెస్తే కట్టలేను. నేను దాచిన డబ్బు అయిదువేలవరకూ ఉన్నాయి. వాటితో అరుణ పెళ్ళి చేద్దాం !" అన్నాడు శివ.

బాంబులాంటి వార్త అది వారికి. తాము ఎప్పుడూ వినని విచిత్రంలా తోచింది.

నిజమే! శివ అంత డబ్బు దాస్తాడని ఎవ్వరూ ఊహించలేదు. అమ్మాయి పెళ్ళి ఎలా చేయాలనే దిగులుతోనే గోపయ్య, అతని భార్య గడిపారు. ఆమె కూలి చేసినా, కొడుకు కొట్టులో గుమాస్తాగా చేస్తున్నా నయాపైస దాచలేక పోయారు. అసలు మిగిలేది కాదు.

నమ్మలేని నిజం వినేసరికి నమ్మలేక పోతున్నారు వారు.

తండ్రిలో ఆరాటం – అంత డబ్బు ఎలా సంపాదించాడని.

చెల్లికి అన్నమీద ప్రేమ– తనకోసం ఏ పని చేసి దాచాడోనని.

"అంత డబ్బు ఎలా సంపాదించావు ? ఎలా దాచావు ?" తేరుకుని ఆశ్చర్యపోతూ అడిగాడు గోపయ్య.


తల్లిలో, చెల్లిలో ఆశక్తి పెరిగింది.

"రోజూ దినపత్రికలు వేస్తున్నా నాన్న. ఇన్నాళ్ళూ మీకీ విషయం చెప్పనేలేదు. అందుకే ఈ సైకిల్ కొన్నది కూడా !"

అసలు సంగతి నాలుగేళ్ళ తర్వాత ఇప్పుడు చెప్పాడు శివ.

"ఇన్నాళ్ళు చెప్పలేదే ?" బాధగా అన్నాడు తండ్రి.

తల్లి, చెల్లి వింత శ్రోతలయ్యేరు. వాళ్ళకు వింతగా ఉంది, విచిత్రంగా ఉంది.



శివ మాట్లాడలేదు. ఇలా దాస్తున్నానని చెప్తే లేనిపోని ఖర్చులు సృష్టింపబడతాయని అతని భయం. అందుకే ఎవరికీ చెప్పకుండా జాగ్రత్తపడ్డాడు. అలా అని తండ్రికి చెప్పలేదు. చెప్తే – "నీ డబ్బును మేం అనవసరంగా ఖర్చు పెడతామా ?" అని మరింత బాధ పడతాడని.

"రోజూ ఉదయాన్నే సైకిల్ మీద వ్యాయామం చేస్తే ఒంటికి మంచిదని నమ్మించి పేపర్లేస్తున్నావా ?"

గోపయ్య హృదయం బాధతో మెలికలు తిరిగింది.

తల్లి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

చెల్లి హృదయం – అన్న తన కోసం డబ్బు దాచిన విషయం బయటపడ్డప్పట్నుంచి మౌనంగా కన్నీరు కారుస్తూనే ఉంది.

ఆ క్షణంలో తనెప్పుడు పోయినా తన కుటుంబానికి ఏ బాధలేదు. తన తెలివితేటలతో తన సంసారాన్ని ఒక కొలిక్కి తేగలడు తన కొడుకు అని అనిపించింది గోపయ్యకు.

అయితే తల్లిలో మాత్రం తను పొలానికి వెళ్ళి కూలి చేయకపోయినా, ఇల్లు గడిచేది, ఇకముందు గడుస్తుంది అనే భావం కలగలేదు. కలగదుకూడా. "పైగా తను ఒక విధంగా, కొడుకు రెండు విధాలుగా సంపాదిస్తూ దాచాడు గనుక ఇప్పుడు అవసరాని కుపయోగపడింది."

"నేను బయటికి వెళ్తున్నా"నని చెప్పి వెళ్ళిపోయాడు శివ.

"చూశావే, వాడేంతపని వేశాడో. మాట మాత్రానికైనా చెప్పలేదు." అన్నాడు గోపయ్య భార్యతో.

చెప్పలేదనే కోపం కొడుకుమీద లేదు. అయితే ఆ సమయంలో, ఒకప్రక్క ఆనందంలో భార్యతో ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

భార్య కొడుకును గొప్పగా ఊహించుకో సాగింది.

'కొడుకు బంగారం !' అనుకున్నది మనసులో.

నెల రోజుల క్రితం గోపయ్య పడ్డ ఆవేదనకు, ఆరాటానికి ఇప్పుడు ఊరట లభించింది.

అతడు మంచంలో పడ్డప్పట్నుంచి కళ్ళ ముందున్న అగ్ని గుండాన్ని ఎలా తప్పించుకోవాలని ఆలోచిస్తున్నాడు... బాధపడుతున్నాడు. లోలోన కుమిలి, కుమిలి ఏడ్చేవాడు. అయితే కాలం ముందుకు సాగేకొద్దీ మామూలు జీవితానికి అంకితమయ్యాడు. ఏడ్వటం మానేశాడు. ఆలోచించటంలేదు. అతనిలో ఒక రకమైన నిస్తేజత ఆవరించింది. భారం కాలానికి వదిలేశాడు. అతడు రాయి. బాధపడి మాత్రం ఏం చేయగలడు. అందుకే కలత చెందటంలేదు.

కూతురు కళ్ళముందు కదులుతూంటే అతనికి చాలా చిన్నపిల్లవలె కనిపించసాగింది !

అయితే మంచంలోపడ్డ ఆరేళ్ళకు, బాధ పడటం మానుకున్న మూడేళ్ళకు అతనిలో ఒక్కసారిగా కలవరం రేగింది – కూతురి పెళ్ళి గురించి. నిశ్చలంగానున్న నీటిమీద రాయి విసిరి నట్లయ్యింది.

ఓ రోజు అర్ధరాత్రి గోపయ్యకు నిద్రాభంగ మయింది. ఎవరో పాటలు పాడుతున్నారు.

ఇంత రాత్రివేళ పాటలు పాడేది ఎవరూ ? క్రైస్తవ మత ప్రచారకులా ? కాదు... వారు సినిమా పాటలు పాడరు ! మరెవరూ ? విద్యార్థులా ? కావచ్చు. కాలేజీ, డిగ్రి మొదలైన మాటలు వినిపిస్తున్నాయి. అవతల ఇళ్ళల్లో కాలేజీ కుర్రాళ్ళు దిగారన్నమాట. అంటే పోకిరి వెధవలు ! ?

అతడు ఆడపిల్ల తండ్రి గనుక వాళ్ళు అతని దృష్టిలో అటువంటివాళ్ళే ! ఒక ఉద్దేశ మంటూ లేని ఆదర్శాలతో, అన్నీ తెలుసను కుంటూనే సంస్కారహీనంగా ప్రవర్తించే యువతరమంటే ఆడపిల్ల తండ్రుల దృష్టిలో వాళ్ళు పోకిరిగాళ్ళే !!

అతనిలో ఏదో భయం ఆవరించింది. రాత్రంతా నిద్రపోలేదు గోపయ్య. ఒకటే ఆలోచనలు. ఎటూ తెగటంలేదు, చిక్కుపడిన దారానికిమల్లే.

తెల్లారింది. భార్య పొలాని కెళ్ళిపోయింది. పిల్లలిద్దరూ చదువుకోసాగారు. అరుణ అంట్లు తోముతోంది. శివ కొట్టుకు బయలుదేరాడు.

"ఒరేయ్. శివ ఒక మాట ?" కొడుకును పిల్చాడు గోపయ్య.

తండ్రి వైపు ఆశ్చర్యంగా చూశాడు. ఎప్పుడూ పిలవని తండ్రి ఈ రోజు ఇలా పిలవటంలో ఏదో ప్రత్యేకత కనపడింది శివకి. కుర్చీ లాక్కొని కూర్చున్నాడు.

"రాత్రంతా అసలు నిద్రే లేదురా. పక్కిళ్ళలో ఎవరో గొడవ చేస్తున్నారు. ఎవరు వాళ్ళు ?" తెలిసే అడిగాడు తెలియనట్లు.

"కాలేజీ పిల్లలు !" కొద్దిసేపు మౌనం.

"అరుణకి పెళ్ళి చేయాల్రా ?" తండ్రి కంఠంలోని ఆదుర్దా, భయాన్ని అర్థం చేసుకున్నాడు శివ.

**!....?**

నేటి లోకంలో
నిస్వార్థమైన స్నేహం
ఆశ్చర్యార్థకం !
పవిత్రమైన ప్రేమ
ప్రశ్నార్థకం...?

— కొల్లు రంగారావు

కాని, తన చెల్లెలు నిప్పు ! ఆ నిప్పు మండుతున్నంతసేపు ఎవరూ ముట్టుకోలేరు. అయితే ఎవరైనా ముట్టుకున్న మరుక్షణం నిప్పు ఆరిపోతుంది. ఎవరో ముట్టుకో అక్కరలేదు. వెలిగి వెలిగి కాసేపటికి ఎంతటి నిప్పయినా చల్లారిపోక తప్పదు. ఆ తర్వాత తమ పరువు ?

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?"

"ఏం లేదు... అలాగే చూద్దాం నాన్న."

"మరి కట్నం... సంగతి ?"

"చూస్తా లెండి." అని మరో మాటకి అవకాశం ఇవ్వకుండా, "నాకు టైం అవుతోంది" అంటూ వెళ్లిపోయాడు శివ.

"ఏం చూస్తాడు ?" అనుకుంటూ తనలో తనే బాధపడసాగేడు.

పదింటికల్లా పిల్లలిద్దరూ బడికి వెళ్ళి పోతారు. ఇక ఆ ఇంట్లో మిగిలేది తండ్రీ, కూతుళ్ళిద్దరే. ప్రతి రోజూ ఇంతే.

కొన్ని రోజులు గడిచాయి.

గోపయ్య ప్రవర్తలో మార్పు రాసాగింది మెల్లమెల్లగా.

చీటికి మాటికి కూతురు మీద విసుక్కో సాగాడు. పక్కింటి వాళ్ళతో కూతురు చీరల విషయమై, కూరల విషయమై మాట్లాడు తూంటే, "ఎవరితో మాటలు ? ఎప్పుడూ కబుర్లేనా ?" అంటూ సాధించటం మొదలు పెట్టాడు. నవ్వినా కోప్పడతాడు.

తండ్రి ప్రవర్తన అరుణకి కోపాన్ని తెప్పించినా పల్లెత్తుమాట మాట్లాడదు. తను పక్కింటి వాళ్లతో మాట్లాడే సమయాల్లో నవ్వినా తండ్రికి వినపడకుండా జాగ్రత్త పడటం అలవాటు చేసుకుంది! తండ్రిలో వచ్చిన మార్పుకి కారణం ఆమెకు తెలియదు.

ఆ ఇంట్లో ఏం జరుగుతుందో అవతలి వాళ్ళకు స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. ఆ ఇంటి ప్రహరీ గోడ చాలా చిన్నది. మట్టిది. వర్షాలకు పడిపోయి, కరిగిపోయి, చలిలో ముడుచుకున్న ముసలిదాని వలె తయారైంది.

అక్కడ ఇంటి ముందు నిలబడితే ఎండకి కూతురి నీడ, మధ్య గదిలో మంచం మీదున్న గోపయ్యకి కనిపిస్తూనే ఉంటుంది. ఆ నీడ కనపడిందంటే చాలు ... కూతురు గడపదాటి పోయినట్లే విలపిస్తాడు... సహించడు. అతని బాధ ఎవరికీ అర్థం కానిది.

తను ఎటూ కదల లేదు. ఎంతసేపని, ఎన్ని రోజులని కూతుర్ని శాసించగలడు ? పొలం పనులకు వెళ్ళొద్దని భార్యతో చెప్తే ఇల్లు గడవటం కష్టం. మరి దీనికి తోడెవరుంటారు? పిల్లలు బడికెళ్ళిపోతారు. తను దేనికీ పనికిరాడు. ఒక రకంగా చెప్పాలంటే తను రాయి. రాయి అయినా కొంచెం ఉపయోగపడుతుంది ! తనవల్ల ఉపయోగం లేదు సరికదా ఉన్న పొలం కాస్త హరించుకుపోయింది. అయినా ఆరోగ్యమూ కలగ లేదు. నయమవని జబ్బని తెలిసి కూడా బంగారం

లాంటి పొలాన్ని అమ్మకుండా ఉంచలేకపోయింది—తన మాంగల్యాన్ని నిలుపుకోవటానికి అతని భార్య.

ఒక్కసారిగా తనమీద తనకే అసహ్యమేసింది. ఈ జీవితం మీద కోపం, కసి, బాధ. చద్దామన్నా చేతకాదు. తననిస్సహాయతను నిందించుకున్నాడు.

ఒక ప్రక్క కూతురుకు తోడెవరూ లేరు. మరో ప్రక్క విద్యార్థుల వెధవ్వేషాలు, చూపులు ఆడ పిల్లని రెచ్చగొట్టక ఏం చేస్తాయి ?

ఏమో ? ఏ వేళ ఎటువంటిదో ? "తనకీ జన్మకి పెళ్ళికాదని" తన కూతురు అనుకుంటే ...?

ఆ తరువాత ఊహించుకోలేకపోయాడు.

అయితే— "పెద్ద వయసుండి పెళ్ళికాని పిల్లలు లోకంలో ఎంతమంది లేరు? వాళ్ళందరూ గడపదాటి బయటికి పోతున్నారా [కాలు జారుతున్నారా ?] వాళ్ళలాంటిదే కదా తన కూతురూనూ ?" అనే తలంపేనాడూ గోపయ్య మనసుకు తట్టనే లేదు !

"గోడ దగ్గర నిలబడటం దేనికీ ? ఏదైనా పని ఉంటే వరండాలోనుంచి అవతలి వాళ్ళతో మాట్లాడు. అంతే !" అని ఒక రోజు ఎమర్జెన్సీ ఆర్డర్ జారీ చేశాడు గోపయ్య.

లోకం పోకడ అతనికి తెలియంది కాదు. ఈ రోజు "చాలా మంచి దానివి" అన్న నోరే రేపు ఆమె ప్రవర్తనను అపార్థం చేసుకుని నిందిస్తుంది. "ఛీ!" అంటుంది. ప్రక్కింటి వాళ్లతో నవ్వుతూ, మాట్లాడుతూ అవతలికి చూచినప్పుడు — అదే సమయంలో అవతలి ఇళ్లల్లో ఉన్న కాలేజీ కుర్రాడొకడు తనూ ఎవ్వరితోనో మాట్లాడుతూ, నవ్వుతూ ఇటు వైపు చూచినప్పుడు ...? ఏమవుతుంది ? వారిద్దరికీ సంబంధం అంటగట్ట బడుతుంది !

ఒక గంటకల్లా గుప్పున చెడ్డవాసన వ్యాపించినట్లు, ఎవరో పనిలేని పుల్లమ్మలు ఉంటారుగదా వాళ్ళు వ్యాపింప చేస్తారు పేట పేటంతటికి.

ఆ తరువాత ఆ అమ్మాయి భవిష్యత్తు—?

అంటే సమాజం ఈ విధంగా అపార్థం చేసుకుని తన కూతుర్లాంటి కూతుర్ల బ్రతుకుల్ని నవ్వులపాలు చేస్తుంది. నిండు జీవితాలతో చెలగాట మాడుతోందన్నమాట. ఎంత హీనమైన పని? ఎంతటి విచారకరమైన విషయం?

ఇతరులతో ఎక్కువగా మాటాడటాన్ని ఆక్షేపించడం పొరపాటని, ఒంటరిగా ఉంటేనే అర్థంలేని ఆలోచనలు మనసును తొలిచేస్తాయనే ఊహే అతనికి కలగలేదు. అతనికి కావలసింది తన కూతురు ఎవ్వరితోనూ మాట్లాడకూడదు. తరువాత-పరిణామాలు ఎలా ఉన్నా సరే!

తను ఈనాడు ఈ పరిస్థితుల్లో లేకుంటే? తనకున్న నాలుగెకరాల మాగాణీ నేలలో బంగారం పండించి ఈ పాటికి పెద్ద కూతురితోపాటు చిన్న కూతుర్ని కూడా అత్తారింటికి పంపేవాడు. కాని, విధి వక్రించింది. తను మంచంలో పడ్డాడు. ఎకరం పొలం అమ్మి పెద్ద కూతురి పెళ్ళి చేశాడు. ఉన్న కొద్ది పొలంలో దాదాపుగా తన జబ్బు నయం కావటానికి అమ్మ వలసి వచ్చింది. మిగిలిన అరెకరం కౌలుకిచ్చేడు. పెళ్ళి అయిన కాడ్నుంచి తను భార్యను పొలానికి పంపటం మానిపించాడు. తరువాత తను పడిపోవటంతో మళ్ళీ కొడవలి చేత పట్టవలసి వచ్చింది. ఇంతటి గతి ఎందుకు పట్టిందంటే—తను మంచంలో పడటంవల్ల. తన రెండో కొడుకు ఇంకా చదువుకోక పోవటానిక్కారణం తను. పెద్దకొడుకు ఇంట్లోంచి పారిపోవటానిక్కారణం తను—సిగరెట్లు త్రాగే చెడు అలవాటు అలవర్చుకున్నాడనే కోపంతో మందలించి, దండిస్తే రోషంకొద్దీ ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. లేకపోతే చిన్న కొడుకు పడుతున్న బాధ వాడే పడేవాడు. ఈ పాటికి ఏదో ఉద్యోగం చేస్తూ తమను పోషిస్తూండేవాడు ! మిగిలిన మగపిల్లలు, వయసులో ఉన్న కూతురూ చాలీచాలని బట్టల్లో ఉంటానిక్కారణం తను.

వీటన్నిటిక్కారణం ఆర్థిక సమస్యలూను. ఆ సమస్యలు ఏర్పడ్డానిక్కారణం తనే! ఎంత ఆలోచించినా చివరికి తన కుటుంబ పరిస్థితిని దిగజారటానికి తను, ఆర్థిక సమస్యలే కారణాలుగా కనిపిస్తున్నాయి.

మరి ఇన్ని సమస్యలవల్లే కూతురు మీద అన్నన్ని ఆంక్షలు!?

అయితే తన మూడో కూతురు ఉమ చావటానిక్కారణం ఎవరూ ? ఆ దేవుడు ! బహుశా తన ఆరోగ్యం ఈ స్థితికి చేరుకుంటుందనే కాబోలు నాలుగో ఏటనే అర్థంకాని జబ్బుతో తనలో ఐక్యం చేసుకున్నాడు-దయామయుడు !


కూతురిమీద విధించిన ఆంక్షల్లో విచిత్రమైనది — సినిమాలు చాలా తక్కువగా చూడనివ్వటం ! అదీ ముందుగా గోపయ్య ఎవ్వరితోనైనా కథ తెలుసుకొని, అది మంచి సినిమా అయినా వయసును రెచ్చగొట్టే సీన్లుంటే కూడా పోనివ్వడు. అప్పుడప్పుడు గోపయ్య వద్దన్నా అతనికి తెలియకుండా శివ దగ్గర డబ్బులడిగి వెళుతుంది. నవల్లు కూడా చదవనివ్వడు. అయితే పత్రికలుగాని, నవల్లుగాని తేడు శివ. బాల సాహిత్యపు పుస్తకాలు మాత్రం ప్రతినెలా రెండు తెస్తాడు శివ. ఆ సలహా ఇచ్చింది గోపయ్య !!

తను బాగుండి ఉంటే ఇల్లు ఈ స్థితిలో ఉండేదికాదు. ఈ స్థితిలో ఉండకుండా ఉండి ఉన్నట్లయితే కారుతున్న ఇంటిమీద తాటాకులు కప్పటానికి చిన్నకొడుకు ఎక్కి, దిగేటప్పుడు క్రిందపడి చేయి విరగ్గొట్టుకునేవాడుకాదు.

పెళ్ళి కుదరక ముందు కూతురిమీద తన ఆంక్షలు ఒక ఎత్తు. ఇప్పుడు గోపయ్య నిఘా మరింత పెరిగింది. ఈ సమయంలోనే జాగ్రత్తగా ఉండాలి. యుద్ధ పరిస్థితులే ఏర్పడకూడదు. ఏర్పడ్డాక అజాగ్రత్తగా ఉంటే పరిణామాలు తీవ్రస్థాయిలో ఉంటాయి. ఆ ఉద్దేశంతోనే కూతుర్ని మరింత జాగ్రత్తతో గమనించసాగేడు గోపయ్య.

ముందు డబ్బిచ్చి ముహూర్తం నిశ్చయించుకుందామనుకున్న కోటి ఒప్పందాన్ని ఉల్లంఘించలేక డబ్బు తీసుకుని బయలుదేరారు శివ, జనార్ధన్ మంచిరోజు చూసుకొని.

అయితే డబ్బిచ్చేముందు అబ్బాయి అందమయినవాడా ? అవిటివాడా ? పెళ్ళిచూపులకు అబ్బాయిని ఎందుకు తేలేదు ? అనే ఆలోచనే రాలేదు ఎవరికీ ? అలా అనుకోకపోవటమనేది—అబ్బాయి మంచివాడు కాకపోతే జనార్ధన్ ఎందుకు తెస్తాడు ఈ సంబంధం అనే ఉద్దేశం కావచ్చు.



బస్టాండు దిగుతుంటే సెంటర్‌లోనే కలిశారు కోటీ, రాజారావులు

''మీ దగ్గరకే వస్తున్నాం'' అని విషయం వివరించాడు జనార్దన్. దగ్గర్లోఉన్న హోటల్లోకి దారితీశాడు రాజారావు. ముగ్గురూ అనుసరించారు. ఓ ప్రక్కకు వెళ్ళి కూర్చున్నారు.

ఓ వ్యక్తి వచ్చి ప్రక్కనే మరో కుర్చీలో కూర్చున్నాడు వాళ్ళనే జాగ్రత్తగా గమినిస్తూ;

''ఫర్వాలేదు ఇచ్చేయిరా డబ్బు ?'' అన్నాడు రాజారావు.

''ఇక్కడే ? ఇంటికెళ్ళి. '' అన్నాడు జనార్దన్.

''ఫర్వాలేదులే. నేనున్నానుగా. కోటికి భార్యలేదు. పోయి చాలా కాలమైంది. ఇంటి దగ్గర ఉండేది అతని చిన్న కూతురే,''

''ఊళ్ళోనీ నలుగురి ఎదుట ఇవ్వాలని గదా?'' నసిగాడు జనార్ధన్. రాజారావు నవ్వాడు. ఏం చేయాలన్నట్టు శివ వైపు చూశాడు జనార్ధన్.

ఇదేం సాంప్రదాయం అనుకోలేదు శివ. ఇప్పుడు ఇవ్వకపోతే వ్యవహారం బెడిసికొడుతుందేమో అనే భయంకొద్దీ ''ఎక్కడైతేనే ఇచ్చేయండి'' అన్నాడు.

బేరర్ వచ్చాడు. కాస్సేపాగి రమ్మని పంపించేరు. అతడు పక్కనే ఉన్న వ్యక్తి దగ్గర కెళ్ళాడు. ఆ వ్యక్తి సర్వర్ చేత కాఫీ తెప్పించుకున్నాడు.

జనార్ధన్ డబ్బు లెక్క బెట్టాడు. వాలుగు వేలు రాజారావు చేతుల్లో ఉంచాడు. రాజారావు కోటి చేతుల్లో పెట్టాడు.

''ముహూర్తం ఎప్పుడు పెట్టుకుందాం ?'' అడిగాడు జనార్దన్.

''ఎల్లుండి రండి'' అన్నాడు కోటి, డబ్బు జాగ్రత్తగా కర్చీఫ్‌లో చుట్టుకుని జేబులో పెట్టుకుంటూ.

కాఫీలు తెప్పించుకుని, తాగి లేచారు. కౌంటర్‌లో బిల్లు, అయిదు రూపాయల నోటు ఇచ్చాడు. చిల్లర ఇంకా తీసుకోలేదు. అంతలో ముగ్గురు పోలీసులు వాళ్ళ కెదురుగా వచ్చారు. అప్పుడే వ్యాన్ కూడా వచ్చి ఆగింది. అందులోంచి మరో నలుగురు పోలీసులు దిగారు !

కోటీ వాళ్ళను చూసి గుడ్లు తేలేశాడు రాజారావు గుండె జారిపోయింది ముచ్చెమటలు పోసాయి జనార్ధన్‌కి, శివకి విషయం అర్ధం కాలేదు. కోటికి, రాజారావుకి తెలుసు పోలీసులు తమను సత్కరించటానికొచ్చారని, వాళ్ళు తమ కోసం వెతుకుతున్నారనీను ! తెలియనిదల్లా జనార్ధన్‌కి, శివకి.

''ఆ డబ్బు వాళ్ళకిచ్చేయండి !''

సివిల్ డ్రస్‌లో ఉండి వాళ్ళ ప్రక్కనే కూర్చుని కాఫీ త్రాగిన స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ అన్నాడు.

''వీళ్ళు మోసగాళ్ళు ! తమకు మగబిడ్డలున్నారని అబద్ధం చెప్పి, నమ్మించి కట్నం డబ్బుల్తో పరారవుతారు. ఇలా అరవైవేలు దాచుకున్నారు. ఎనిమిది కేసులున్నాయి వీరిద్దరిమీద మీరు అదృష్టవంతులు. కాని మరో రకంగా దురదృష్టవంతులైనందుకు విచారిస్తున్నాను'' అని కొంచెం బాధపడి ''ఊఁ.. వ్యాన్ ఎక్కించండి వీళ్ళని'' అన్నాడు యస్సై.

అక్కడున్న వారందరికీ నోట మాట రాలేదు. జనార్ధన్‌కి, శివకి అది పిడుగుపాటు సంఘటన. కలా ? నిజమా ? అన్నట్టుంది వారి స్థితి.

జనార్ధన్ వెంటనే తేరుకుని తన స్నేహితుడి వైపు అసహ్యంగా చూసి, ''వ్యాపారం చేస్తున్నానని చెప్పి ఇంత నీచానికి దిగజారతావా ? నీ బుద్ధి ఇంత హీనమైనదా ? ఛీఛీ. నువ్వు నా స్నేహితుడైనందుకు సిగ్గుపడుతున్నాను.'' అని అక్కడ్నించి కదిలాడు. శివకూడా యాంత్రికంగా వెంట నడిచాడు. అతడ్ని ఎవరో నిలువుగా కోసి నడిపిస్తున్నట్లుంది.

అక్కడ చాలామంది గు మి గూ డా రు. అందరూ తి ట్ట సా గా రు. క్యాషియర్‌కూడా తిడుతున్నాడు. ఆవేశంగానూ, కోటీకివ్వవలసిన చిల్లరని గల్లాపెట్టెలో వేసుకుంటూ సంతోషంగానూ !

పోలీసులు వెళ్ళిపోయారు. జనార్ధన్, శివ ఇంటిదారి పట్టారు.

''నన్ను మన్నించు శివ అతడలాంటివాడని తెలియదు...'' చాలా బాధగా అన్నాడు. శివకంటేకూడా ఆయనే ఎక్కువ బాధ అనుభవిస్తున్నాడు. శివకి జబ్బు చేయకనే నోరు పడిపోయినట్టుగా ఉంది. తండ్రికి ఏమని చెప్పాలో అనే తీవ్ర మానసిక క్షోభలో పడిపోయాడు. అతని మనసులో తుఫాను లేచింది. నడుస్తున్నాననే భావనే లేదు అతనిలో.

గోపయ్య ఇంట్లో ఏడుపులు, పెడబొబ్బలు వినబడుతున్నాయి. గో ప య్య మరణించాడు. కూతురు పెళ్ళవుతుందనే సంతోషంలో నిశ్చింతగా కన్నుమూశాడు.

మృత్యువు ఎవరికి ఏ సమయంలో వస్తుందో తెలియదు. గోపయ్య విషయంలో మా త్ర ం సరైన సమయంలోనే వచ్చింది.

శివ మనసులో తుఫాను ఆగినట్లయ్యింది. క్షణం తరువాత వేదాంతివలె నవ్వుకున్నాడు. ఇంట్లోవారు గుండెపగిలి ఏడుస్తుంటే అతనికి కన్నీరే రావటంలేదు.

అతడు డబ్బు దాచటం అనే ఉద్దేశం చెల్లి పెళ్ళి చేద్దామని. అయితే ఆవసరం మా త్ర ం తండ్రి అంత్యక్రియలకు ఏర్పడింది.

ఎంత చిత్రం — ఇన్నాళ్ళూ కష్టపడ దానికి ఫలితం ?

విధి వీధిలో నిశిధి ! ఆ నిశీధిలో వక్రబుద్ధికి బలి అయి, చిన్నబోయిన శివుని ఆకారం !! ★

విశాఖపట్నంలో శ్రీ ఎ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో నిర్మించబడుతున్న ''ఛాలెంజ్'' చిత్రం యూనిట్‌కి విశాఖ కళాసాగర్ సన్మానం చేసిన సందర్భంగా నటి విజయశాంతికి మొమెంటో అందచేస్తున్న సెన్సార్ బోర్డు సభ్యుడు శ్రీ టి. సుబ్బరామిరెడ్డిని చిత్రంలో చూడవచ్చు.

